క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చూస్తా



ఎమ్మెల్సీని కలిసిన టీఎన్జీవో కార్యవర్గసభ్యులు

జగిత్యాల: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చూస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తగా ఎన్నికైన టీఎన్జీవో కార్యవర్గం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం ఉద్యోగుల సమస్యల కోసం పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, సాహెద్‌బాబు, మహమూద్, మమత, సుగుణాకర్, మధుకర్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. బుధవారం మినీస్టేడియంలో జగిత్యాల రూరల్ మండల బాలబాలికల కబడ్డీ, ఖోఖో, జూనియర్ బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, గెలుపే లక్ష్యంగా ఆటల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నరేశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో గాయత్రి, సీఐ వేణుగోపాల్, ఎంపీవో రవిబాబు, పీఈటీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కార్మికులు

జగిత్యాల: అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులివ్వాలని, ప్రతి కార్మికుడికి ఉద్యోగ భద్రత కల్పించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు అన్నారు. బుధవారం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే మజ్దూర్‌సంఘ్ అతిపెద్దదని, కార్మికుల వైపు ఎప్పుడూ ఉంటూ పోరాటం చేస్తుందన్నారు. ప్రతి కార్మికుని సంక్షేమం కోసం ఎప్పుడూ పోరాటం చేయడం జరుగుతుందని, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు సుధీర్‌కుమార్, ఎదులాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

జగిత్యాల: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగాధర్, రాంచంద్రం పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

జగిత్యాల: ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు అన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లో తపస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్లు పూర్తయ్యేదెప్పుడో..?

- పెండింగులో పలు లింకు రోడ్లు
- రవాణా సౌకర్యాలతోనే మండల అభివృద్ధి
- ఎన్నికల హామీలుగానే రోడ్ల అభివృద్ధి



అధ్వానంగా తయారైన బుగ్గారం ప్రధాన రహదారి

బుగ్గారం: గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉండి, కొత్త మండలంగా ఏర్పాటైన బుగ్గారం ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధిలో ఇంకా వెనుకబడే ఉంది. నూతన మండలంగా ఏర్పడితే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించిన ప్రజల ఆశలు అడియాశలయ్యాయి.మండలంలో డబుల్ రోడ్ల నిర్మాణంతో పాటు పలు గ్రామాలకు లింకు రోడ్లను ఏర్పాటు చేస్తామని అప్పటి పాలకులు ప్రజలకు హామీలిచ్చారు. దీనిలో భాగంగా బుగ్గారం ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి నుంచి మండల కేంద్రం మీదుగా మండలంలోని రాయపట్నం జంక్షన్ వద్ద జాతీయ రహదారి వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తామని వాగ్దానం చేశారు. మొదటగా బుగ్గారం మండల కేంద్ర పరిధిలో డబుల్ రోడ్డుతో పాటూ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే గంగాపూర్–యశ్వంతరావుపేట గ్రామాల మధ్యన గల వాగుపై వంతెన నిర్మించారు.

డబుల్ రోడ్డుతో మండలాభివృద్ధి

బుగ్గారం ఎక్స్‌రోడ్డు నుంచి రాయపట్నం వద్ద జాతీయ రహదారి వరకు డబుల్ రోడ్డుగా మార్చితే మండలం అభివృద్ధి చెందడానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.గొల్లపల్లి,ధర్మపురి,వెల్గటూర్ మండలాలకు సైతం రాకపోకలు సాగించడానికి ప్రయోజనకరంగా ఉంది. ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి అభివృద్ధికి అవకాశం ఉంటుంది. మండల కేంద్రాన్ని వివిధ గ్రామాలతో అనుసంధానం చేయడానికి లింకురోడ్లు నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు పలుమార్లు హామీలు ఇచ్చినా అవి పూర్తిస్తాయిలో నెరవేరడం లేదు. ఇప్పటి వరకు కొన్ని గ్రామాల పరిధిలో రోడ్లు పూర్తయినా నాణ్యతలేమి కారణంగా త్వరగానే చెడిపోయాయి. మండలకేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రావాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లతోనే అభివృద్ధి



బుగ్గారం నుంచి అనేక మంది శాసనసభకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఈ ప్రాంతం ఇంకా వెనుకబడే ఉంది. ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా గ్రామాల మధ్యన లింకు రోడ్లు,డబుల్ రోడ్డు నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయి.

– సుంకం ప్రశాంత్,బుగ్గారం

ప్రతిపాదనలు పంపించాం



బుగ్గారం మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.ఇప్పటికే అనేక గ్రామాల మధ్యన లింకురోడ్లు నిర్మించాం.బుగ్గారం ప్రధాన రహదారి మరమ్మతుల నిమిత్తం అనుమతులున్నా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

– భోగ సతీష్,ఏఈఈ ఆర్అండ్‌బీ



కథలాపూర్: మండలంలోని చింతకుంటలో గ్రామపంచాయతీ కార్యాలయం భవనం అసంపూర్తి నిర్మాణంలో ఉందని గ్రామస్తులు తెలిపారు. నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి రూ. 20 లక్షలు గతేడాది మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి ఫిల్లర్ల వరకు మాత్రమే నిర్మించి వదిలేశారు. అధికారులు చొరవ చూపి పనులు త్వరగా పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగదీశ్వర్, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ, కథలాపూర్ సెల్ నంబర్: 9100853882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఘనంగా గీతా జయంతి



భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేస్తున్న రమేశ్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని భారత్ సురక్ష సమితి కార్యాలయంలో సురక్ష సమితి ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీకృష్ణ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, సత్యనారాయణ, కాశీనాథం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో బుధవారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండితుడు బట్టు హరికృష్ణా,విశ్రాంత కమిషనర్ కుమార స్వామి గీతా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్, కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, కోశాధికారి నీలి శ్రీనివాస్,అధ్యాపకులు పాల్గొన్నారు.

11డీఎంపి01,02 : తీగలధర్మారంలో నిర్వహించిన గీతా యజ్ఞం

ధర్మపురి : మండలంలోని తీగలధర్మారంలోని ఆలయంలో బుధవారం కృష్ణం వందే జగద్గురుం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలతో శ్రీకృష్ణునికి అభిషేకం, తులసి పూజ, గోపూజ, శ్రీమత్ భాగవద్గీత సంపూర్ణ పారాయణం, త్రికుండి గీతా యజ్ఞం గావించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ గీతా ఆశ్రమ అధ్యక్షుడు వేముల రాంరెడ్డి, రాజిరెడ్డి మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని హనుమన్ మందిరంలో గీతా జయంతిని పురష్కరించుకుని, బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అల్లాడి హరిప్రసాద్ 111 మందికి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గీతా జయంతి సందర్భంగా శ్రీ మద్భగవద్గీత గ్రంథాలను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏవో

ఇబ్రహీంపట్నం: రైతులు మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి రామ్‌చందర్ సూచించారు. బుధవారం మండలంలోని వేములకుర్తిలో మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఈ యాసంగిలో కోరుట్ల డివిజన్‌లో 28,460 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేస్తున్నారని, ప్రస్తుత వాతావరణంలో కత్తెర పురుగు ఉధృతి మొక్కజొన్నలో ఆశించనున్నట్లు దీని నివారణకు వారం నుంచి 10 రోజుల లోపు లింగాకర్షక బుట్టలు ఒక ఎకరానికి 8 నుంచి 10 అమర్చుకోవాలని సూచించారు. ఒక లీటర్ నీటిలో వేప నూనె 5 ఎంఎల్ లేదా, క్లోరామ్ త్రినిప్రోల్ 80 ఎంఎల్ ఎకరానికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రవళి, రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సంక్షేమానికి కట్టుబడి ఉంటా



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

జగిత్యాల: పట్టభద్రుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లాలోని పలు విద్యాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రులకు అనేక రకాలుగా చేయూతనివ్వడమే ప్రధాన లక్ష్యమని, ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా కల్పించడానికి కృషి చేస్తానన్నారు. అలాగే ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ధ్యేయమన్నారు. ఆశావహులకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్స్ ఉచితంగా పంపిణీ చేసి, ఆన్‌లైన్ క్లాసులు ప్రవేశపెట్టి ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ క్రీడలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఆర్‌డీవో

సారంగాపూర్: సీఎం కప్ క్రీడలను డీఆర్‌డీవో, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ బుధవారం సారంగాపూర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతు క్రీడల్లో గెలుపు, ఓటములను స్పోర్టివ్‌గా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, ఎంపిడివో గంగాధర్, ఎంఈవో కిషోర్, పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు ఉన్నారు.

మేడిపల్లి: సీఎం కప్ భీమారం మండల స్థాయి క్రీడా పోటీలు రెండో రోజూ కొనసాగాయి. భీమారం హైస్కూల్ హెచ్ఎం జవ్వాజి అశోక్ పోటీలను పరిశీలించి, విజేతలకు బహుమతులు అందించారు.

విద్యార్థులకు అభినందన

కథలాపూర్: మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలు నిర్వహించగా, భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని పీడీ నవీన్ బుధవారం తెలిపారు. కబడ్డీ, ఖో ఖో విభాగంలో బాలురు, బాలికలు ప్రతిభ చాటి ప్రథమ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

గంగమ్మగుడి నిర్మాణానికి భూమిపూజ

జగిత్యాలరూరల్: మండలంలోని మోరపల్లిలో గంగమ్మతల్లి గుడి నిర్మాణం కోసం బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు జున్ను రాజేందర్, చంద రాధాకిషన్‌రావు, కమలాకర్‌రావు, సదానందం, రాజేందర్, గంగారాం, భూమారెడ్డి, ముదిరాజ్ కుల పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని 37వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్ కాలుకు సంబంధించిన ఆపరేషన్ జరగగా, బుధవారం ఎమ్మెల్సీ రమణ అతనిని కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

మల్లాపూర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు టీయూడబ్ల్యూజేహెచ్–143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్, జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని కోరుట్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. జర్నలిస్టుల హక్కులను సాధించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తించేయడంలో టీయూడబ్ల్యూజేహెచ్–143 ముందుందన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యభద్రత కల్పించే విధంగా హెల్త్‌కార్డులు ఇప్పించామన్నారు. కార్యక్రమంలో మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రమేశ్, జిల్లా కార్యదర్శులు కనుక సంజీవ్, రుద్ర రాంప్రసాద్, ప్రెస్‌క్లబ్ సభ్యులు కృష్ణమాచారీ, ప్రవీణ్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మోహన్ బాబు మీడియాకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

కొండగట్టు: మీడియా ప్రతినిధులపై సినీనటుడు మోహన్ బాబు దాడి చేయడాన్ని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హెచ్ 143 ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు బుర్ర రమేశ్ ఖండించారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్ బాబు మీడియాకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ప్రభుత్వం పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులపై దాడి గర్హనీయం

మల్లాపూర్: జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం గర్హనీయమని టీయూడబ్ల్యూజే(హెచ్143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్, జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. మోహన్‌బాబు మీడియాపై దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

ముస్లిం మైనార్టీ కమిటీ మండల అధ్యక్షుడిగా అబ్దుల్

మల్లాపూర్: ముస్లిం మైనార్టీ కమిటీ మండల అధ్యక్షుడిగా వీవీరావుపేటకు చెందిన అబ్దుల్ రజాక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు ప్రకటించారు. మండల కేంద్రంలోని జామా మజీద్‌లో బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మహ్మద్ బషీర్, ప్రధాన కార్యదర్శులుగా మహ్మద్ తక్కిమొద్దిన్, అశ్రిచ్, కార్యదర్శిగా మహ్మద్ ఇషాక్, మహ్మద్ సాల్మన్, సంయుక్త కార్యదర్శిగా మహ్మద్ హుస్సేన్, మండల సమన్వయకర్తగా కోశాధికారిగా మహ్మద్ బాబాఫరీద్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో ప్రతిమ ఫౌండేషన్, కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ నెరేళ్ల దేవేందర్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని జువ్వాడి నర్సింగరావు ప్రారంభించి మాట్లాడారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ గీతారెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ కౌశిక్, మండల కోఆర్డినేటర్లు, వైద్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు,వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల సంఘాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మెట్‌పల్లిరూరల్: కుల సంఘాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలంలోని పలు సంఘాల భవనాలకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను బుధవారం ఆయా సంఘాల సభ్యులకు అందజేశారు. అనంతరం ఆత్మకూర్‌లో మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు దిలీప్,భూమారెడ్డి,తిరుపతిరెడ్డి,విజయ్, ప్రదీప్‌రెడ్డి, మహిపాల్, సీనియర్ నాయకురాలు నీలమ్మ పాల్గొన్నారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై జాతీయ సదస్సు

జగిత్యాల: ఈకామర్స్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగం, వ్యాపార నిర్వహణ రంగంలో ఆధునిక పోకడలు, వాటి వల్ల కలిగే సవాళ్లను గుర్తించి జనవరి 7,8 తేదీల్లో ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్ ఇన్ కామర్స్ అనేఅంశంపై జాతీయ సదస్సు ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో అత్యధికంగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, రామకృష్ణ, నరేశ్, అర్జున్ పాల్గొన్నారు.

ద్రవ నత్రజని సరఫరా

జగిత్యాల: జగిత్యాల మండలం పొలాస పశువైద్య ఉప కేంద్రానికి ద్రవ నత్రజని సరఫరా అయిందని వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కె.పూర్ణచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని మేలు జాతి ఆబోతుల వీర్యాన్ని నిలువ ఉంచడానికి నత్రజనిని ఉపయోగిస్తారని తెలిపారు. రైతులు తమ గేదెలు, ఆవులు ఎదకు వచ్చిన వెంటనే సమీప పశువైద్య కేంద్రానికి తీసుకువస్తే కృత్రిమ గర్భాదారణ ఇంజక్షన్లు ఇస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న క్రాఫ్ట్ మేళా

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఎక్సలెన్స్ స్కూల్‌లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సృజనాత్మకతతో హస్తకళ నైపుణ్యాలతో తయారుచేసిన వివిధ కళారూపాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజితరావు, డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు విద్యార్థులను అభినందించారు.

పేదలకు ప్రతి ఒక్కరూ సేవలందించాలి

జగిత్యాల: పేదలకు ప్రతి ఒక్కరూ సేవలందించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సతీమణి శాంతకుమారి అన్నారు. బుధవారం బీబీకే ఆధ్వర్యంలో 70 నిరుపేదలకు దుప్పట్లను శాంతకుమారి అందజేశారు. బీంరాజ్‌పల్లి కుమార్ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కుమార్, మాధవి, వృద్ధాశ్రమ అధ్యక్షుడు సత్తయ్య, సూర్యం, శ్రీకాంత్, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయ రాజగోపుర ద్వారం ఏర్పాటుకు పూజలు

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా రాజగోపుర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం రాజగోపురానికి రాతి ద్వారాల ఏర్పాటు చేసే పనులు ప్రారంభించి, ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వం నుంచి విడుదలైన రూ. 82 లక్షల నిధులు, భక్తులు సమకూర్చిన విరాళాలతో రాజగోపురం, ప్రాకార నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

'నర్సింగరావును విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు'

మల్లాపూర్: జువ్వాడి నర్సింగరావును విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో మాజీ ఎంపీపీ నల్ల రాజన్నతో కలిసి మాట్లాడారు. పదేళ్ల నియంత బీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వాన్ని ఎన్నుకోవడంతో బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. తాము తెచ్చిన నిధులపై చర్చించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూటి సురేశ్, నాయకులు జలందర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆటోస్టాండ్ ఏర్పాటు

జగిత్యాలరూరల్: పట్టణ శివారులోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం డీజిల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో ఆటోస్టాండ్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు ఎండి.హాజీబాయి, ఆటో యూనియన్ నాయకులు, రైల్వేమాస్టర్ వామన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి

రాయికల్: మండలంలోని కొత్తపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.మణికంఠ రాష్ట్ర స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు బాపురావు, కృష్ణహరి అభినందించారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం చేయనున్నట్లు తెలిపారు. ఈ కల్యాణానికి అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని తెలిపారు.

నేడు ఆలయాల హుండీ లెక్కింపు

రాయికల్: మండలంలోని కొత్తపేట రాజరాజేశ్వర స్వామి నాగాలయం, రాయికల్‌లోని హనుమాన్ ఆలయంలో ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో విక్రమ్ తెలిపారు.

నేడు అభ్యంతరాల స్వీకరణ

రాయికల్: మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం అన్ని గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితాలో ప్రచురణపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి: ధర్మపురిలోని మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బోధించుటకు గెస్ట్ అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రాధాకిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ సైన్స్ బోధించడానికి అర్హుల గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ పీజీ, పీహెచ్‌డీ, నెట్,సెట్ అర్హత కలిగిన వారు ఈ నెల 13 లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.